బంగ్లాదేశ్‌లో మళ్లీ సంక్షోభం

- తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనస్, ఆర్మీ చీఫ్ జమాన్ మధ్య తీవ్ర విభేదాలు
- ఎన్నికలు నిర్వహించకుండా అధికారంలో కొనసాగాలని యూనస్ యోచన!
- డిసెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న జమాన్
- ఎన్నికల కార్యాచరణ ప్రకటించాలన్న జియా పార్టీ
- రాజీనామా చేస్తానంటూ యూనస్ బెదిరింపులు?
- ఆయనకు మద్దతుగా నేడు విద్యార్థుల ర్యాలీ
- ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా అల్లర్లకు కుట్రలు!

ఢాకా, మే 23: బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో దీనికి నిరసనగా శనివారం (మే 24) రాజధాని ఢాకాలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన మద్దతుదారులు ప్రకటించారు. యూనస్‌ను ఐదేళ్లపాటు పదవిలో ఉంచాలి, ముందు సంస్కరణలు-తర్వాతే ఎన్నికలు అంటూ నిరసనకారులు తమ పోస్టర్లలో డిమాండు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకర్-ఉజ్ జమాన్ బుధవారం పిలుపునిస్తూ దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజా ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని పునరుద్ఘాటించిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బంగ్లాదేశ్ అనధికార ప్రధానమంత్రిగా కొనసాగుతున్న యూనస్ పదవీ కాలం ముగిసిపోతుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో శనివారం యూనస్ మద్దతుదారులు ఆర్మీ కంటోన్మెంట్ వరకు నిర్వహించే ర్యాలీ ఎటువంటి హింసాత్మక ఘటనలకు దారితీస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఆర్మీ చీఫ్‌పై తిరుగుబాటు?

విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారిన దరిమిలా సైన్యం నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేసిన ప్రధాని షేక్ హసీనా గత ఏడాది ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కి పారిపోయారు. ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ బీబీసీకి తెలిపారు. 'ఎన్‌సీపీకి సారథ్యం వహించేందుకు నహీద్ ఫిబ్రవరిలో యూనస్ క్యాబినెట్‌కి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహం జమునలో యూనస్‌తో సమావేశమైన నహీద్ పదవిలో కొనసాగవలసిందిగా అభ్యర్థించారని సమావేశానికి హాజరైన మరో ఎన్‌సీపీ నాయకుడు అరీఫుల్ ఇస్లాం అదీబ్ తెలిపారు. తాను పదవిలో కొనసాగలేనని, మరో ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని విద్యార్థి నాయకులే ఏర్పాటు చేసుకోవాలని యూనస్ కోరినట్లు బంగ్లాదేశ్ దినపత్రిక ప్రొథోమ్ తెలిపింది.

విద్యార్థులను, ఇస్లామిస్టులను వాడుకుంటున్న యూనస్!

విద్యార్థులు, ఇస్లామిస్టు మూకలను తన సొంత సైన్యంగా వాడుకుంటున్న యూనస్ ఎన్నికలు నిర్వహించకుండా అధికారంలో కొనసాగాలని ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. 2026 జూన్‌లోగా ఎన్నికలు జరుగుతాయని యూనస్ చెబుతున్నప్పటికీ బీఎన్‌పీతోసహా వివిధ రాజకీయ పార్టీలు సత్వర ఎన్నికలను కోరుతున్నాయి. అయితే ఆర్మీ చీఫ్ జమాన్ మాత్రం యూనస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వం డిసెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని బుధవారం హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆయనను పదవీచ్యుతుడిని చేసేందుకు విద్యార్థులు, ఇస్లామిస్టు మూకలను యూనస్ వాడుకునే అవకాశం ఉందన్న అనుమానాలు కూడా బలంగా వ్యాపిస్తున్నాయి.

భారత్‌తో రక్షణ కాంట్రాక్టు రద్దు

కోల్‌కతాకు చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్‌తో రూ. 180.25 కోట్ల రక్షణ ఒప్పందాన్ని బంగ్లాదేశ్ శుక్రవారం రద్దు చేసుకుంది. భారత్‌తో దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. తమ రక్షణ ఆర్డర్‌ను రద్దు చేసుకున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీకి నోటిఫై చేసింది. ఇతర దేశాలకు జరిగే బంగ్లాదేశీ కార్గో ఎగుమతులకు భారత్‌లో ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యాలు రద్దు చేయాలని భారత్ ఇటీవల తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా బంగ్లాదేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు చర్చ సాగుతున్నది.

భారత విద్యార్థులకు స్టడీ పర్మిట్లలో 31% కోత

నిబంధనలు కఠినతరం చేస్తున్న కెనడా

ఒట్టావా: భారత యువతకు జారీ చేసే స్టడీ పర్మిట్ల సంఖ్యలో కెనడా కోతలు విధిస్తున్నది. ఆ దేశ వలస, కాందిశీకుల, పౌరసత్వ సంస్థ(ఐఆర్‌సీసీ) ప్రకారం ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో కేవలం 30,640 మంది భారత విద్యార్థులకు మాత్రమే స్టడీ పర్మిట్లను జారీ చేశారు. గత ఏడాదితో పోల్చితే స్టడీ పర్మిట్ల సంఖ్యలో 31 శాతం తగ్గుదల కనిపించింది. తమ దేశ ప్రజలకు, వలసదారులకు, విదేశీ విద్యార్థులందరికీ గృహ వసతి, ఆరోగ్య, రవాణా కల్పించడంలో ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని కారణంగా చూపిస్తూ స్టడీ పర్మిట్ల జారీని కెనడా ప్రభుత్వం తగ్గిస్తూ వస్తున్నది.

జేఈఈ మెయిన్ పేపర్ 2 ఫలితాలు విడుదల

ఐదుగురికి 100 పర్సంటైల్

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ 2025 పేపర్ 2ఏ(బీఆర్క్), పేపర్ 2బీ(బీ ప్లానింగ్) ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శుక్రవారం విడుదల చేసింది. ఏప్రిల్ సెషన్‌లో పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ స్కోర్లు, అఖిల భారత ర్యాంకులను జేఈఈ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పేపర్ 2ఏ(బీఆర్క్)లో ఎన్‌టీఏ స్కోర్ 100ని ప్రథం అల్పేష్ ప్రజాపతి, పాట్నా నీల్ సందేశ్ సాధించగా పేపర్ 2బీ(బీ ప్లానింగ్)లో 100 స్కోరును గౌరమ్ , తరుణ్, సునిధి సింగ్ సాధించి టాపర్లుగా నిలిచారు.

పోలింగ్ స్టేషన్ బయట బూత్‌ల దూరం 100 మీటర్లకు తగ్గింపు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. పోలింగ్ సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్ స్లిప్‌లు పంచే బూత్ దూరాన్ని 100 మీటర్లకు తగ్గించింది. పోలింగ్ బూత్ బయట మొబైల్ డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఓటర్లు ఓటేసేందుకు వస్తూ మొబైల్ ఫోన్లను తీసుకొచ్చి ఇబ్బంది పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకొంది.

సీజేఐ కేంద్రంగా సుప్రీం.. ఇది మారాలి

వీడ్కోలు సభలో జస్టిస్ ఓకా కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో సంస్కరణలు అవసరమని జస్టిస్ ఏఎస్ ఓకా అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయనకు వీడ్కోలు పలికే కార్యక్రమం జరిగింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి కేంద్రంగా సుప్రీంకోర్టు పని చేస్తున్నదని, దీనిలో మార్పులు అవసరమని చెప్పారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పదవీ కాలంలో ఈ మార్పులు రావచ్చునని తెలిపారు. ఈ నెల 13న సీజేఐగా పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా తమను పారదర్శక మార్గంలో నడిపించారన్నారు. సర్వోన్నత న్యాయస్థానంలోని ప్రతి జడ్జిని విశ్వాసంలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకునేవారని చెప్పారు. జస్టిస్ గవాయ్ రక్తంలో ప్రజాస్వామిక విలువలు ఉన్నాయన్నారు. ''ట్రయల్ కోర్టులు, సామాన్యుల గురించి కూడా మనం ఆలోచించాలి. ట్రయల్, జిల్లా కోర్టుల్లో అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రయల్ కోర్టును ఎన్నడూ సబార్డినేట్ కోర్ట్ అని పిలవొద్దు. అలా పిలవడం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకం'' అని చెప్పారు.

'ఫీల్డ్ మార్షల్ కాదు.. రాజుగా ప్రకటించాల్సింది!'

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఆటవిక పాలన నడుస్తున్నదని మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్‌కు 'ఫీల్డ్ మార్షల్'గా పదోన్నతి లభించడంపై ఎక్స్ పోస్ట్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''జనరల్ అసీం మునీర్‌ను ఫీల్డ్ మార్షల్‌గా చేశారు. నిజాయితీగా చెప్పాలంటే, 'రాజు' అనే బిరుదు ఆయనకు కచ్చితంగా సరిపోతుంది. ఎందుకంటే, ప్రస్తుతం దేశం ఆటవిక చట్టం పాలనలో ఉంది. అడవిలో కేవలం ఒకే ఒక రాజు ఉంటాడు' అని పేర్కొన్నారు.

నీటిని నిలిపివేస్తే.. మీ ఆయువు తీస్తాం

భారత్‌పై పాక్ ఆర్మీ అధికారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: భారత్‌పై పాక్ ఆర్మీ మరో అధికారి నోరు పారేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. పాకిస్థాన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌద్రి మాట్లాడుతూ భారత్ తమ వాటా నీటిని నిలిపివేస్తే.. కచ్చితంగా ఆ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాం అంటూ మాట్లాడారు. అయితే పహల్గాం దాడి తర్వాత భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన క్రమంలో ఈ వ్యాఖ్యలు చేసినట్టుగా తెలుస్తున్నది. ఈ వ్యాఖ్యలు గతంలో లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్ ప్రసంగాన్ని పోలి ఉన్నాయి. 'మీరు నీటిని నిలిపివేస్తే.. దేవుడి సాక్షిగా మీ శ్వాసను ఆపేస్తాం.. అదే నదుల్లో మీ రక్తాన్ని ప్రవహించేలా చేస్తాం' అంటూ మాట్లాడారు. ఈ రెండు ప్రసంగాల వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఒక ఆన్‌లైన్ డిబేట్‌లో అఫ్గాన్‌కు చెందిన రాజకీయ నాయకురాలు, మాజీ ఎంపీ మరియం సొలైమంకి మాట్లాడుతూ పాకిస్థాన్ ఆర్మీ అధికారి మాటలు, ఉగ్రవాద సంస్థల స్క్రిప్ట్‌తో పోలి ఉన్నాయని తెలిపారు.

పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

లాహోర్, మే 23: పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశ విమానాలకు మన గగనతల నిషేధాన్ని వచ్చే నెల 23 వరకు పొడిగించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఏప్రిల్ 30న విధించిన ఈ నిషేధం ఈ నెల 23తో ముగిసింది. దీన్ని పొడిగిస్తూ శుక్రవారం నోటమ్‌ను భారత ప్రభుత్వం జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ కూడా భారత విమానాలకు తమ గగనతల నిషేధాన్ని వచ్చే నెల 24 వరకు పొడిగించింది. ఈ నిషేధం భారత సైనిక విమానాలకు కూడా వర్తిస్తుందని వివరించింది.

హార్వర్డ్‌పై ట్రంప్ చర్యకు బ్రేకులు

విదేశీ విద్యార్థుల ప్రవేశాల అనుమతి రద్దు ఉత్తర్వులు నిలిపివేసిన ఫెడరల్ కోర్టు

వాషింగ్టన్, మే 23: హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు అనుమతి రద్దు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఫెడరల్ జడ్జి అడ్డుకున్నారు. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్(ఎస్ఈవీపీ) కింద అంతర్జాతీయ విద్యార్థులకు డిగ్రీ విద్యను అందచేస్తున్న హార్వర్డ్ యూనివర్సిటీపై ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని బోస్టన్ ఫెడరల్ కోర్టు శుక్రవారం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. మసాచుసెట్స్‌లోని అమెరికా జిల్లా కోర్టులో హార్వర్డ్ దాఖలు చేసిన దావాపై ఫెడరల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వైట్ హౌస్ రాజకీయ డిమాండ్లను తిరస్కరించినందుకు ప్రతీకారంగా ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యకు ట్రంప్ ప్రభుత్వం పాల్పడినట్లు తన వ్యాజ్యంలో హార్వర్డ్ యూనివర్సిటీ ఆరోపించింది. 7,000 మందికి పైగా వీసా దారులైన అంతర్జాతీయ విద్యార్థులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వర్సిటీ తెలిపింది. కాగా, ఎస్ఈవీపీని రద్దు చేస్తున్నట్లు హార్వర్డ్ యూనివర్సిటీకి అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి క్రిస్టీ నీమ్ తెలియచేశారు. తక్షణమే ఇది అమలులోకి వస్తుందని ఆమె తెలిపారు. హార్వర్డ్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ప్రతి సంవత్సరం యూనివర్సిటీలో దాదాపు 500 నుంచి 800 మంది భారతీయ స్కాలర్లు, విద్యార్థులు చేరుతుంటారు. ప్రస్తుతం 788 మంది భారతీయ విద్యార్థులు ఇందులో చదువుతున్నారు.

నలుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

కొత్తగూడెం ప్రగతి మైదాన్ : భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో జరిగింది. ఖవాండే-నెల్గుండ ఇంద్రావతి నది పరీవాహక ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాలు శుక్రవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా మావోయిస్టులు ఎదురుపడి వారిపై కాల్పులు జరిపారు. కాల్పుల వేగం పెంచుతూనే ఆ ప్రాంతాన్ని జవాన్లు చుట్టుముట్టారు. మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయాక ఘటనా స్థలిలో మృతి చెందిన నలుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు కొన్ని ఆయుధాలు, విప్లవ సాహిత్యం వంటి ఇతరత్రా వస్తువులను జవాన్లు ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారు.

మహిళల హక్కుల్లో ప్రసూతి సెలవులు కీలకం

సుప్రీంకోర్టు ఉద్ఘాటన

న్యూఢిల్లీ: మహిళలకు ఉన్న ప్రత్యుత్పత్తి హక్కుల్లో ప్రసూతి సెలవులు కీలకమని సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. ఏ సంస్థ కూడా మహిళలకు ఉన్న ప్రసూతి సెలవుల హక్కులను హరించలేదని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయినికి ప్రసూతి సెలవులు నిరాకరించిన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ తీర్పు వెలువరించింది. పసూతి సెలవును ఇప్పుడు ప్రాథమిక పునరుత్పత్తి హక్కుల్లో భాగంగా గుర్తిస్తామని తెలిపింది. తనకు మొదటి పెండ్లి కారణంగా ఇద్దరు పిల్లలు ఉన్నారని.. అయితే దాన్ని సాకుగా చూపి తనకు రెండో పెండ్లి వల్ల కలిగిన గర్భధారణకు అవసరమైన ప్రసూతి సెలవులను ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించిందని పిటిషనర్ కేసు వేశారు. తాను రెండో పెండ్లి చేసుకొన్నాకే ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని ఆమె వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం పిటిషనర్‌కు మద్దతిచ్చింది.

'కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?'

న్యూఢిల్లీ: విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలోనే ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు శుక్రవారం రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నదని వ్యాఖ్యానించింది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు కోటాలో 14 ఆత్మహత్యలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 'ఒక రాష్ట్రంగా మీరేం చేస్తున్నారు? పిల్లలు కేవలం కోటాలోనే ఎందుకు ఆత్మహత్య చేసుకొంటున్నారు? ఒక ప్రభుత్వంగా మీరు దీని గురించి ఆలోచించలేదా?' అని జస్టిస్ పార్థీవాలా ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. ఓ ఐఐటీ-ఖరగ్‌పూర్ విద్యార్థి ఆత్మహత్య. కోటాలో ఇటీవల ఆత్మహత్య చేసుకొన్న నీట్ విద్యార్థిని ఆత్మహత్య కేసుల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

పోక్సో కేసులో దోషికి శిక్ష విధించని సుప్రీం

న్యూఢిల్లీ: మైనర్‌తో లైంగిక సంబంధం పెట్టుకున్నందుకు పోక్సో చట్టం కింద కేసును ఎదుర్కొంటున్న ఓ వ్యక్తికి ఎటువంటి శిక్ష విధించకుండా సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని 142 అధికరణ కింద తనకు గల అసాధారణ అధికారాలను ఉపయోగించింది. అయితే ఇదే సుప్రీంకోర్టు నిరుడు నిందితుడిని నిర్దోషిగా విడుదల చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును తిరస్కరించడమేగాక తీర్పు అమలును నిలిపివేయడం విశేషం. ధర్మాసనం శుక్రవారం ఈ కేసుపై తీర్పు వెలువరిస్తూ తనపై జరిగింది నేరమని బాధితురాలికి కూడా తెలియదని, ఈ ఘటన వల్ల చట్టపరంగా బాధితురాలు చాలా కష్టాలు అనుభవించిందని ధర్మాసనం పేర్కొంది. బాధితురాలు ప్రస్తుతం తన భర్త, బిడ్డతో కలసి పశ్చిమ బెంగాల్‌లో జీవిస్తోంది.

'ఆపరేషన్ సిందూర్' ఎంపీల విమానం గాలిలో చక్కర్లు

- ఉక్రెయిన్ డ్రోన్ దాడితో మాస్కో విమానాశ్రయం మూసివేత
- కొన్ని గంటలపాటు గాలిలోనే కనిమొళి బృందం విమానం

మాస్కోలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమైన భారత ప్రతినిధి బృందం

మాస్కో: 'ఆపరేషన్ సిందూర్'పై వివరించేందుకు రష్యాకు వెళ్లిన భారత ప్రతినిధి బృందం ప్రయాణించిన విమానం గురువారం గాలిలో కొన్ని గంటలపాటు చక్కర్లు కొట్టింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడి నేపథ్యంలో మాస్కో విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఎట్టకేలకు ఈ విమానం సురక్షితంగా దిగింది. డీఎంకే ఎంపీ కనిమొళి నాయకత్వంలోని అఖిలపక్ష ఎంపీల బృందానికి రష్యాలోని భారత దౌత్య కార్యాలయం అధికారులు స్వాగతం పలికి, హోటల్‌కు తీసుకెళ్లారు. భారత దౌత్య కార్యాలయం ఇచ్చిన ఎక్స్ పోస్ట్‌లో, అన్ని రూపాల్లోని ఉగ్రవాదంపై పోరాడటంపై భారత దేశ దృఢ సంకల్పాన్ని తెలియజేసేందుకు కనిమొళి నేతృత్వంలోని అఖిల పక్ష ఎంపీల ప్రతినిధి బృందం మాస్కోకు చేరుకున్నట్లు తెలిపింది.

తుఫాన్.. వడగండ్లు.. కుదుపులు

- ఇండిగో విమాన ప్రయాణికులకు భయానక అనుభవం
- విపత్కర పరిస్థితుల్లోనూ వక్రబుద్ధి చూపిన పాకిస్థాన్
- తమ గగనతలంలో ప్రయాణానికి అనుమతి నిరాకరణ
- నిమిషానికి 8500 అడుగుల వేగంతో కిందకు విమానం
- ఎట్టకేలకు శ్రీనగర్‌లో సురక్షితంగా విమానం ల్యాండింగ్

న్యూఢిల్లీ, మే 23: విపత్కర పరిస్థితుల్లోనూ పాకిస్థాన్ తన వక్రబుద్ధి చూపింది. భారీ వడగళ్ల వాన, తీవ్రమైన కుదుపులతో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడిన ఢిల్లీ-శ్రీనగర్ ప్రయాణికుల ఇండిగో 6ఈ 2142 విమానాన్ని తమ గగనతలం నుంచి ప్రయాణించడానికి అనుమతించాలని పైలట్ చేసిన అభ్యర్థనను పాకిస్థాన్ తిరస్కరించింది. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ వివరించారు. భారత్-పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో పఠాన్‌కోట్ వద్ద వాతావరణంలో ఒక్కసారిగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. వడగళ్ల వానతో తీవ్ర కుదుపులకు లోనై విమానంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడటంతో ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. విమానం కాక్‌పిట్‌లోని పలు పరికరాలు పనిచేయకుండా పోయాయి. దీంతో ఒక దశలో ఈ విమానం నిమిషానికి 8,500 అడుగుల వేగం (సాధారణ వేగం 1500 నుంచి 3000)తో కిందకు జారడం ప్రారంభించింది. ఆ సమయంలో విమానంలో పలువురు టీఎంసీ ఎంపీలు సహా 220 మంది ప్రయాణికులు ఉన్నారు.

మానవత్వాన్ని మరచి..

అత్యవసర పరిస్థితుల్లో చేసిన అభ్యర్థనను మన్నించడంలో పాకిస్థాన్ మానవత్వాన్ని మరచింది.విమాన సిబ్బంది లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను నేరుగా కాంటాక్ట్ చేశారు. తమ విమానం అత్యవసర పరిస్థితుల్లో ఉందని, ప్రయాణికులు ప్రమాదంలో ఉన్నారని, గాలుల నుంచి తప్పించుకోవడానికి తమను కొద్దిసేపు పాక్ గగనతలంలోకి అనుమతించాలని కోరగా, దానిని పాకిస్థాన్ తిరస్కరించింది. తర్వాత శ్రీనగర్ ఏటీసీ మార్గనిర్దేశంలో శ్రీనగర్‌లో సురక్షితంగా ల్యాండ్ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మైసూర్ పాక్ కాదు.. మైసూర్‌శ్రీ

జైపూర్: పహల్గాం ఉగ్రదాడి దేశం మొత్తాన్ని ఏకం చేసింది. దీనికి కారణమైన పాకిస్థాన్ పేరును కూడా ఉచ్చరించేందుకు ప్రజలు ఇష్టపడలేదు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో పలు మీమ్స్ వెల్లువెత్తాయి. మైసూర్‌పాక్ పేరులోని 'పాక్'ను తొలగించి మైసూర్' భారత్' అని పేరు పెట్టాలంటూ నెటిజన్లు సరదాగా డిమాండ్ చేశారు. ఇది రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన త్యోహార్ స్వీట్స్ యజమాని అంజలి జైన్‌ను ఆకర్షించింది. దేశభక్తిని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపించాలని భావించి తన షాప్‌లో విక్రయించే స్వీట్లలో 'పాక్' పేరుతో ముగిసే వాటి పేర్లను మార్చేశారు. అందులో అందరికీ సుపరిచితమైన, ఇష్టమైన మైసూర్ పాక్ కూడా ఉంది. దీని పేరును ఆమె 'మైసూర్ శ్రీ' అని మార్చేశారు. మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ స్వీట్లకు చివరన ఉన్న పాక్ పేరు తొలగించి.. మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీగా నామకరణం చేశారు. అంతేకాదు, షాప్‌లో అత్యంత ఖరీదైన స్వర్ణ భస్మ్ పాక్, చాందీ భస్మ్ పాక్ పేర్లను కూడా స్వర్ణ శ్రీ, చాందీశ్రీగా మార్చారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత వినియోగదారుల్లో మార్పు వచ్చిందని, స్వీట్ల చివరన ఉన్న పాక్ అని ఉంటే కొనేందుకు ఇబ్బందిపడుతున్నారని, వారి కోరిక మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

మనుషులతో మాట్లాడే చెట్టు!

డబ్లిన్: ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజీ శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సృష్టించారు. 'టాకింగ్ ట్రీ' అనే వినూత్న ప్రాజెక్టును చేపట్టడం ద్వారా మనుషులు నేరుగా వృక్షాలతోనే సంభాషించేందుకు వీలుకల్పించే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. చెట్ల నుంచి వెలువడే బయో ఎల్క్ట్రికల్ సిగ్నల్స్‌ను కృత్రిమ మేధస్సు (ఏఐ)తో పాటు అధునాతన సెన్సర్ల సాయంతో మానవ భాషగా మార్చడం ద్వారా పర్యావరణ సంరక్షణకు సరికొత్త దారులు తెరిచారు. ఈ టెక్నాలజీ ద్వారా నేలలోని తేమ, పీహెచ్ స్థాయి, గాలిలోని తేమ, ఉష్ణోగ్రత, సూర్యకాంతి తదితర పర్యావరణ అంశాలను ఈ సెన్సర్లు గుర్తిస్తాయి. ఆ డాటాను చెట్టు నుంచి వెలువడే బయో ఎల్క్ట్రికల్ సిగ్నల్స్‌తో సమన్వయం చేస్తారు. తర్వాత ఆ సిగ్నల్స్‌ను ఏఐ సాయంతో మానవ భాషలోకి అనువదిస్తారు. తద్వారా వృక్షాలు తమ అనుభవాలను మనుషులకు తెలియజేసే వీలు కల్పించారు. పర్యావరణ సంరక్షణే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతను శాస్త్రవేత్తలు ట్రినిటీ కాలేజీలోని 200 ఏండ్లనాటి 'లండన్ ప్లేన్' వృక్షానికి అనుసంధానించారు. అనంతరం ఓ వ్యక్తి ఆ చెట్టుతో సంభాషించగలిగాడు. అందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తించే బయోసెన్సర్

న్యూఢిల్లీ : బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను గుర్తించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), రూర్కెలా సరికొత్త సెమీ కండక్టర్ పరికరం ఆధారిత బయోసెన్సర్‌ను అభివృద్ధి చేసింది. సంక్లిష్టమైన లేదా ఖరీదైన ల్యాబొరేటరీ ప్రొసీజర్స్ అవసరం లేకుండానే ఈ విధానంలో బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను గుర్తించవచ్చు. రసాయనాల అవసరం లేకుండానే ఈ బయోసెన్సర్ పని చేస్తుంది. ఆరోగ్యవంతమైన రొమ్ము కణాలు, క్యాన్సర్ క